# కథావేదిక

**మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం**

## శిష్యునికి పంగనామాలు

**-భమిడిపాటి సోమయాజి**

సమింతింజయ - పంకజవల్లి భార్యాభర్తలు. పెళ్లయి పది ఏళ్లు గడచిపోయింది. పిల్లలు పుట్టలేదు. పెళ్లాన్ని 'పంకజం' అంటూ చాలా ప్రేమగా పిలుస్తూంటాడు. వాళ్లు చాలా అన్యోన్య దంపతులు. పంకజం మనసు అద్దంలాంటిది. అందులో భర్త ప్రతిబింబమే ఎక్కువ కనిపిస్తుంది. ఎప్పుడూ చలాకీగా ఉంటుంది. చాలా కలుపుగోలు మనిషి.

బయట ఆకుకూరలు కొనుక్కొని లోపలకి వస్తున్న పంకజం ఎదురు గుండా రెండో అంతస్తులో ఖాళీ అయిన పోర్షన్‌లోకి ఎవరో దిగారని చెప్పింది భర్తకి.

"పోనీవే నాకు అన్నం పెట్టు. ఆఫీసుకి టైమ్ అయిపోతోంది అన్నాడు."

'జయ... జయ' అని మొగుడ్ని ముద్దుగా పిల్చుకుంటుంది పంకజం.


"సరే! మీకెప్పుడూ హడావుడే. అన్నీ డైనింగ్ టేబిల్ మీద సిద్ధం చేశాను. ఇంక వడ్డించడమే తరువాయి" రండి అన్నది పంకజం.

జయ భోజనం ముగించుకుని ఆఫీసుకి వెళ్లిపోయాడు. సాయంకాలం ఇంటికి వచ్చేసరికి ఒక బోర్డు కనిపించింది. అక్కడే ఆగి చదువుతే బాగుండదని లోపలకి వచ్చి భార్యని అడిగాడు "దేన్ని గురించి ఆ బోర్డు" అని.

'ఇచ్చట కథలు రాయడం నేర్పబడును' అని బోర్డు పెట్టినట్లు చెపుతూ కొంచెం ఉత్సాహంగా "ఏమండీ మీరు కూడా కథలు రాయడం నేర్చుకుని, ఒక నాలుగు కథలైనా రాసి, నా చిరకాలపు కోరిక తీర్చండి. అప్పుడు, మనం కడపలో ఉన్నప్పుడు ప్రయత్నం చేశారు. మీకు అంతగా కష్టంగా ఉండి రాత్రుళ్లు ఎక్కువగా మేల్కోలేకపోతే, పగలే రాయండి. ఏమంటారు?" అని ముగించింది.

జయకి గుండెల్లో రాయి పడింది. 'ఇదేమిట్రా భగవంతుడా! ఏదో ప్రశాంతంగా జీవితం గడచిపోతుంటే ఎదురుగుండా వీళ్లు వచ్చారు' అనుకున్నాడు జయ. రెండు రోజుల్లో ఆ కథలు రాయడం నేర్పే ఆయన భార్యతో పంకజానికి పరిచయమయిపోయింది. అతి త్వరలో స్నేహంగా మారింది. ఆవిడతో చెప్పింది పంకజం 'ఎలా అయినా తన భర్తకు కథలు రాయడం నేర్పించాలని'. కాలనీలో అందరూ, ఆ కథలు నేర్పే ఆయన్ని 'కథలు మేస్టారు' అని పిలవడం మొదలుపెట్టారు. కొంచెం మంచి మాటలతో జయను ఈ విద్య నేర్చుకోవడానికి ఒప్పించింది.

ఒక ఆదివారం, ఆ కథల మేస్టారు జయ ఇంటికి ఒక పైజమా లాల్చీ వేసుకుని, కష్టపడి పెంచుకున్న గడ్డంతో ఒక బెంగాలీ బాబులా వచ్చారు.




## శిథిలమవుతున్న చైనా వాల్

ప్రపంచ వింతల్లో చైనావాల్ ప్రత్యేకత మనందరికీ తెలిసిందే. అయితే అత్యధికంగా పెరుగుతున్న టూరిస్టుల వలన కొంత, అక్కడి ప్రజల నిర్లక్ష్యం వలన కొంత, ఆర్కియాలజీ వారి అశ్రద్ధ వలన కొంత చైనావాల్ శిథిలమవుతోంది. 6,000 కిలోమీటర్ల పొడవున్న ఈ చైనావాల్‌లో ఇప్పుడు మూడవ వంతు మాత్రమే మిగిలి ఉంది. అక్కడక్కడ విరిగిపడిన గోడను సిమెంట్ గోడగా కట్టినా, ఇంకా చాలా వరకు శిథిలావస్థలోనే ఉంది. ఏడాదికి కోటి మంది టూరిస్టులు సందర్శించే ఈ చైనావాల్ పరిస్థితిని చూసి కనీసం పర్యావరణ ఉద్యమకారులు ఏదైనా నిర్ణయం ఇప్పటికైనా తీసుకుంటే బావుంటుంది.

## మంచునీటిలో ఈత

ఈతకొట్టడం అనేది ఓ మంచి వ్యాయామం. అయితే చలికాలంలో ఈతకొట్టడమంటే మాత్రం మనకు సాధ్యం కాదు. మరి దాదాపు గడ్డకట్టే నీళ్లలో ఈతకొట్టడమంటే? అమ్మో అంటాం. కానీ ఫైన్లెండ్‌లో జరిగిన ఐస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పదకొండేళ్ల బాలుడి నుండి డెబ్బై ఏళ్ల ముదుసలి వరకు పాల్గొనడం విశేషం. గత ఇరవై అయిదేళ్లుగా క్రమం తప్పకుండా జరుగుతున్న ఈ ఈతపోటీల్లో ఎందరో ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. ఐస్‌గడ్డ కట్టే ఈ చన్నీళ్లలో ఈతకొట్టడం అంటే ప్రాణాలతో చెలగాటమే. సుమారు మూడు వందల మంది పాల్గొన్న పోటీలో రష్యన్ వాళ్లకి స్వర్ణపతకం లభించడం విశేషం.

-శిరీష




"సరే! ఇక పాఠం మొదలుపెట్టనా" అన్నారు మాస్టారు.

జయ తలూపాడు. పంకజం కూడా పక్కనే కూర్చుంది.

మాస్టారు మొదలు పెట్టారు. "మనం ఏ పని చేసినా అత్యంత శుచి, శుభ్రంతో ఏకాగ్రతతో చేయాలి. సాంప్రదాయాలు పాటించాలి" అని చెపుతూ "మీరు ఎక్కడ కూర్చుని కథలు రాయాలనుకుంటున్నారు" అని అడిగారు.

జయ చూపించాడు ఒక టేబుల్ ఉన్న ప్రదేశం.

"బాగుంది! చెల్లాయి" అని పంకజాన్ని పిలుస్తూ "మేమిద్దరం ఆ టేబుల్ దగ్గరకి వస్తాం, ఎదురు (శకునం)రా అమ్మా! అన్నాడు.

పంకజం పరవశించిపోయింది. సరే టేబుల్ దగ్గర ఉన్న కుర్చీలో జయను కూర్చో పెట్టాడు. కాగితాలు సిద్ధం చేశాడు. ఒక కొత్త పెన్ను పంకజం చేతిలో పెట్టి ఈ పెన్ను మీ ఆయనకు ఇయ్యమన్నాడు. తుల్జాపూర్ భవానీదేవి శివాజీకి ఖడ్గం ఇచ్చినట్లు కెమేరా పంకజం చేతే తెప్పించి ఒక ఫోటో తీశాడు.

"ముందు ముందు జయ పెద్ద రచయిత అయితే ఆ ఫోటో పత్రికలో వేయడానికి పని చేస్తుంది" అన్నాడు.

జయ చేతిలోని పెన్ను తీసుకుని ఒకసారి తను రాశాడు. అలా రాస్తే శుభంట! పెన్నుతో తలమీద కొట్టుకోమన్నాడు జయని. అలా చేస్తే మెదడులో ఉన్న కథకి సంబంధించిన ఆలోచనలన్నీ పెన్నులోకి వెళ్లి, పెన్ను కాగితం మీద తొందర తొందరగా కదుల్తుందన్నాడు. అందుకనే పెద్దలు అంటారు 'ఏదైనా గురుముఖంగా నేర్చుకోవాలని.' బ్రెయిన్ అందరికీ ఒకే చోట ఉంటుంది కనుక తన తల మీద కొట్టుకొని చూపించారు మాస్టారు ఇలా కొట్టుకోవాలని.

"కథ రాసేటప్పుడు ఎప్పుడూ ఒళ్లు విరుచుకోకూడదని, ఆవలించకూడదని, ఈ రెండూ దరిద్రాలని కథకి అడ్డం పడతాయి శనిలాగ" అనీ తర్వాత ఇంకొక ముఖ్య విషయం చెప్పారు. కథ రాసేటప్పుడు ఆలోచిస్తూ ఎప్పుడూ పైకి చూడకూడదని, అలా చూస్తే రాస్తున్న కథ పై లోకాలకి పోతుంది, తర్వాత ఆలోచిస్తూ ఎడమవైపు చూడకూడదని ఎడమవైపు లక్ష్మిస్థానం అని, లక్ష్మి, సరస్వతీ, అత్తా కోడళ్లు కనుక సరస్వతీదేవికి కోపం వచ్చి కథ నాశనం చేస్తుందనీ చెప్పారు మాస్టారు. పాపం! జయ అడిగాడు "అది కాదు మాస్టారూ! ఎప్పుడూ అలివేలు మంగమ్మ వేంకటేశ్వరస్వామికి కుడివైపు ఉంటుంది కదా. మరి లక్ష్మి స్థానం కుడివైపే కదా" అని.

ఈ ప్రశ్న అడిగిన పంకజంకేసి గర్వంగా చూశాడు జయ.

"అది అరవ సాంప్రదాయం. మన తెలుగువారికి సంబంధం లేదు" అని ఒక్క దెబ్బతో తేల్చేశారు. పైగా చెప్పారు తను పాఠం చెప్పేటప్పుడు మధ్యలో ప్రశ్నలు వేయొద్దనీ, సందేహాలుంటే క్లాసయిపోయిన తరువాత చెప్తానన్నాడు.

మాస్టారికి కోపం వస్తుందేమో అన్న భయంతో "మాస్టారు చెప్పేటప్పుడు మధ్యలో మనం మాట్లాడితే ఆయన ఆలోచనలకి అంతరాయం కలిగి పాఠం చెడిపోతుంది" చెప్పింది పంకజం.

"సరే! ఏ కథైనా ముందు క్షుణ్ణంగా ఆలోచించి రాయడం మొదలుపెట్టాలి" అని చెప్పారు మాస్టారు. మళ్లీ రెండు రోజుల తర్వాత వచ్చి ఎంతవరకూ రాశారో చూశానన్నారు.

ఆ మర్నాటి నుంచి ఒక కథ రాయడం మొదలుపెట్టాడు జయ. కాలం గడచిపోతోంది. కథ మాత్రం ముందుకు సాగటం లేదు.

"చాలా కష్టంగా ఉందని" పంకజంతో చెప్పాడు.

"ఏం ఫర్వాలేదు. అలవాటయిపోతుంది" అంది పంకజం.

'ఏమిటి అలవాటవ్వడం కష్టపడడమా' అనుకున్నాడు.

నాలుగు రోజుల తరువాత చెప్పాడు తన వల్ల కాదని.

"మీరు ఒళ్లు విరుచుకోవడం, ఆవలించడం, పైకి చూడడం వగైరా ఏమైనా చేస్తున్నారేమో అని అనుమానంగా ఉంది" అంది పంకజం.

"ఒట్టు మీ బామ్మమీద" అన్నాడు జయ.

పంకజానికి బామ్మ అంటే చాలా ప్రేమ. అసలు ఒక విధంగా పంకజం పక్కింటి వాళ్లతో, ఎదురింటి వాళ్లతో ఎక్కువ స్నేహం చేయడానికి వాళ్ల బామ్మే కారణం. 'పొరుగింటి వాళ్ల దగ్గర ఉన్న మంచి గ్రహించాలి' అని చెప్పేదిట. మంచి గ్రహించడమే గానీ, జయ ఇంట్లో అప్పు రూపేణా సరుకులు సంగ్రహిస్తున్నారు. కడపలో ఉన్నప్పుడు ఇంట్లో సరుకులు ఇచ్చేయ్యడం వల్ల రెండు సంసారాలకి అయ్యే ఖర్చు అయ్యేది. ఇక్కడ కూడా సరుకులు ఇచ్చేస్తోంది. ఒకరోజు జయ లోపల గదిలో ప్రశాంతంగా కథ రాసుకునే సమయంలో పక్కింటి ఆవిడ వచ్చి "పంకజం! నువ్వు ఏమీ అనుకోపోతే నిన్ను ఒకటి అడుగుతాను" అంది.

"అయ్యో దానికేం భాగ్యం పిన్నిగారూ! అడ

గండి'' అంది పంకజం.

"కథలు కాయితానికి ఒక వైపే రాస్తారు కదమ్మా, ఏమైనా కథలు తిరిగి వచ్చేస్తే, ఆ కథలు నాకియ్యమ్మా, పిల్లలు లెఖ్ఖలు చేసుకుంటారు, ఆ ఖాళీగా ఉన్న పేజీల్లో. పుస్తకాలు కొని ఫీజులు కట్టి చదివించలేక చస్తున్నాం'' అంది పిన్నిగారు.

"అయ్యో ఇదేం పెద్ద విషయమా! అసలు కథ రాయడం పూర్తి చేసి పంపాలి కదా. అసలు కథ అంటూ బయటికి వెళ్లి తిరిగి వచ్చేస్తే ఆ కాగితాలు మీకే ఇచ్చేస్తాను. ఇంకెవరికీ ఇవ్వను'' అంది పంకజం.

ఈ సంభాషణంతా విన్న జయకి ఒళ్లు మండి పోయింది.

"చచ్చి కథ రాసేది వెనుకవైపు వీళ్ల పిల్లలు లెక్కలు చేసుకోడానికా! అసలు పంకజాన్ని అనాలి. దీని బుర్రలో మట్టి తప్ప ఇంకేం లేదు. దీని బుర్రపై మొక్క వేస్తే చక్కగా మొలుస్తుంది. అంత సారవంతమైన మట్టి ఉంటుంది దీని బుర్రలో. అందుకునే దీనికి బురద పేరు పెట్టారు. అన్నీ బురద ఆలోచనల్లే దీనికి. అసలు నా చేత ఈ కథలు రాయించకపోతేనేమి!'' అని మదనపడ్డాడు జయ.

ఒకరోజు మాస్టారు వచ్చి జయతో మాట్లాడే సమయంలో పాలవాడు కిటికీ దగ్గర నిలబడి మాస్టారు వైపే చూస్తున్నాడు.

"ఏమిటి అక్కడ నిలబడ్డావు? అమ్మగార్ని పిలిస్తే పాలు పోయించుకుంటారు కదా!'' అన్నాడు జయ. పంకజం వచ్చి పాలు పోయించుకున్న తర్వాత పాలవాడు వెళ్లిపోయాడు. మొత్తం మీద కొన్ని నెలలకి కథ రాసి పంపాడు జయ.

రాసి ఆరు నెలలైనా కథ మాత్రం అచ్చవలేదు. ఏం చేస్తాం. అక్కడకీ కథ పత్రికకి పంపే ముందు వేద పండితులు వచ్చి ఆశీర్వచనం కూడా పలికారు. ఈ మధ్యన పంకజం ఇంటికి రావడం మానేసిన ఓ పెద్దాయన వచ్చి పంకజాన్ని పలుకరించాడు.

"ఏమిటమ్మా ఈ మధ్య మీ ఆయన ఎప్పుడు చూసినా ఏదో దిగాలుగా, ఆలోచిస్తూ రాసుకుంటూ ఉంటున్నాడు. ఏమైనా రిసెర్చి పేపర్లు రాస్తున్నాడా ఏమిటి?''

"అబ్బే! అదేం లేదండి! ఏదో ఒక కథ రాసి పత్రికకి పంపారు.''

"అచ్చయిందా'' అని అడిగారు ఆయన.

"ఇంకా లేదండి'' అంది పంకజం.

"తగినన్ని స్టాంపులు పెట్టిన కవరు జత చేసి పంపిస్తే వాళ్లే వెనక్కి పంపిస్తారు'' అన్నాడు పెద్దాయన. అనుభవజ్ఞుడు 'జయ వలన ఏం కాదని తెలుసేమో ఆయనకి' అనుకుంది. ఎవరేమి మాట్లాడినా కథ వెనక్కి రావడం గురించే ఏమవుతుందో అనుకున్నది పంకజం. పక్కింటి పిన్నిగారు కాగితాలు లెఖ్ఖలు చేసుకోవాలని అడిగినప్పుడే నిర్ణయించుకున్నాడు సమింతింజయ. స్టాంపులు అతికించిన కవరు జతచేసి కథతో పాటు పంపకూడదని, ఆ కథ పత్రికలో వస్తుందో రాదో తెలియదు కానీ ఇంటికి మాత్రం తిరిగి రాదు. అలా చేశాడు సమింతింజయ. ఈలోగా ఎప్పటికైనా మాస్టారు కథలు రాయడం నేర్పుతారని ఆయన అడిగినప్పుడల్లా డబ్బు సర్దుబాటు చేసింది పంకజం.

'చెల్లెమ్మా!' అంటూ వచ్చి ఒక వెయ్యి రూపాయలు అర్జెంటుగా కావాలనీ, మూడువేలు కావాలనీ, మొత్తంమీద ఒక పదివేలు పైచిలుకు పట్టేశాడు. ఒకరోజు రాత్రికి రాత్రి ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడు.

'ఒక శని వదిలింది' అనుకున్నాడు జయ.

ఒకరోజు జయ పంకజాన్ని వాళ్ల జాయింట్ ఎకౌంట్ పాస్‌బుక్ అడిగాడు ఒక పదిహేను వేలు తీసుకుందామని.

"ఇరవై వేలు ఉండవలసిన బేలన్స్ పదివేలు అయింది. ఏమిటి'' అని గట్టిగా అడిగాడు.

కళ్లల్లో నీళ్లు పెట్టుకుంటూ చెప్పింది 'మాస్టారుకిచ్చి మోసపోయానని.' పాపం! పంకజం అంటే అమితమైన ప్రేమ జయకి. "ఏడవకు కళ్లు తుడుచుకో'' అన్నాడు. ఇంతలో పాలవాడు వచ్చాడు. వాడికి ఈ కుటుంబంతో చాలా చనువు.

"ఎందుకండీ లక్ష్మీదేవి లాంటి అమ్మగారు బాధపడుతున్నారు'' అని అడిగాడు.

విషయం వివరించాడు జయ.

"అయ్యో ఆ గెడ్డంవాడ్ని ఎలా నమ్మారండీ! ఇదే బోర్డు పెట్టి కథలు రాయడం నేర్పిస్తానని, చెప్పిన కథ చెప్పకుండా చెప్పి అంతకు ముందున్న కాలనీలో పాతిక వేలదాకా పట్టేశాడు. ఎవళ్లూ గుర్తు పట్టకుండా గెడ్డం పెంచుకుని తిరుగుతున్నాడు. అయ్యగారు! మీకు జ్ఞాపకం ఉందా, ఒక రోజు ఆయన్ని పోల్చుకోవడానికే కిటికీ దగ్గర నిలబడి చూశాను. అయ్యో నేను ముందైనా మీకు చెప్పలేదే'' అని బాధపడ్డాడు. "మీరు ఆయన బుట్టలో పడిపోతారనుకోలేదండి. లేకపోతే చెప్పేవాడ్ని'' అన్నాడు.

జయ ఇంటి ఎదురుగా ఆ బోర్డు అలానే ఉండిపోయింది. ఇచ్చట క్రాపులు అందంగా చేయబడును అన్నట్లు కనిపిస్తూ ఉంటే దాన్ని తీసి విసిరికొట్టాడు జయ.

★



## ఆసక్తిదాయకం

కొన్ని సినిమాలు తారలకి చిరకాలం గుర్తుండిపోతాయి. ఇంతవరకూ చేయని పాత్రలతో తారలు కొత్త రూపంతో అందర్నీ అలరిస్తుంటారు. ఇప్పుడు కరీనాకపూర్ వంతొచ్చింది. ఎలాంటి అసభ్యతకి తావివ్వకుండా ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన 'చమేలీ' చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. వేశ్య పాత్ర అయినా ఎంతో డిఫరెంట్‌గా నటించిందని అంతా అంటున్నారు. ఇమేజ్‌ని పక్కనపెట్టి కెరీర్‌లో తనకంటూ ఓ ప్రత్యేకతని సంపాదించుకుంది కరీనా. ముందు ముందు ఎలాంటి పాత్రలు చేయనుందో అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

